సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 20 । జూలై । 2025



టిడ్కో గృహాలకు మోక్షమెప్పుడో?
నూజివీడు పట్టణ పరిధిలోని టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఎప్పటికి అందుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.
8లో



నిమ్మ ధర పతనం
నిమ్మ ధర దిగజారటంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వారం రోజులుగా ధరలు పతనమవుతున్నాయి.
8లో



ఆషాఢంలోనూ అదే రద్దీ
ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. క్షేత్రంలోని అన్ని విభాగాలు భక్తులతో కళకళలాడాయి. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది.

న్యూస్‌రీల్

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్రంగా ఖండించారు. శనివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిని సీఎం చంద్రబాబు కేవలం కక్షపూరిత రాజకీయాలతోనే అరెస్ట్ చేయించారని విమర్శించారు. చంద్రబాబు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ జైలులో పెట్టాలని చూస్తున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎంత మందిని అరెస్ట్ చేసినా వైఎస్సార్‌సీపీ జెండాను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు.

పీఎంశ్రీకి పెదతాడేపల్లి గురుకులం ఎంపిక



గురుకుల పాఠశాలను సందర్శించిన బృందం

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లా ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. శనివారం గురుకుల పాఠశాలను ఐదుగురు సభ్యులతో కూడిన బృందం పరిశీలించింది. బృందంలో ఎంఈఓలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి, ఏఎంఓ సుబ్రహ్మణ్యం, పీఎంశ్రీ వీరాస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 25 గురుకుల పాఠశాలలను పరిశీలించామన్నారు. కిచెన్ గార్డెన్, ఆటస్థలం, కంప్యూటరైజ్డ్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, కెరీర్ గైడెన్స్ ల్యాబ్, ఫుడ్ ప్రాసెసింగ్, స్కిల్ ల్యాబ్ తదితర అంశాల ప్రాతిపదికగా తీసుకుని పెదతాడేపల్లి గురుకులాన్ని ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారన్నారు. పాఠశాల ప్లే ఫీల్డ్ అభివృద్ధికి రూ.5 లక్షలు, రసాయన శాస్త్ర ప్రయోగశాలకు రూ.13 లక్షలు మంజూరవుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్ ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో కుల ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపు తదితర అంశాలపై శనివారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణతో నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఏఐ టెక్నాలజీకి సంబంధించిన వివిధ టూల్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, పాలకొల్లు తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ మాట్లాడారు.

ఏసీబీ వలలో సబ్ ట్రెజరీ ఉద్యోగి



పట్టుబడిన హనుమంతరావు

కైకలూరు: రిటైర్డ్ అటెండర్‌కు రావాల్సిన సొమ్ములకు లంచం డిమాండ్ చేసిన కైకలూరు సబ్ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ కులుకులూరి హనుమంతరావు అలియాస్ ఆంజనేయులను శనివారం ఏలూరు ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరుకు చెందిన షేక్ సుభానీ 2016లో రెవెన్యూ అటెండర్‌గా రిటైరు కాగా శాలరీ ఫిక్స్ కాలేదు. ఇటీవల ఏలూరు ప్రధాన కార్యాలయం నుంచి కైకలూరు సబ్ ట్రెజరీకి ఆయన ఫైల్‌ను క్లియర్ చేసి పంపారు. ఏరియర్స్, గ్రాట్యూటీ కలిపి రూ.33 లక్షలు రావాల్సి ఉండగా.. కైకలూరు నుంచి ఫైల్ తిరిగి పంపడానికి సుభానీ మూడు నెలలుగా హనుమంతురావు చుట్టూ తిరుగుతున్నారు. రూ.66 వేలు లంచం ఇవ్వాలని హనుమంతరావు డిమాండ్ చేయగా సుభానీ బతిమలాడితే రూ.55 వేలకు ఫైనల్ చేశాడు. జూన్ 26న రూ.10 వేలు ఇవ్వగా.. ఈనెల 2న సుభానీ ఖాతాలో పదవీ విరమణ లబ్ధి కొంత జమైంది. ఇంకా రూ.6 లక్షలు రావాల్సి ఉండగా.. ఆ మొత్తం కోసం రూ.20 వేలు లంచం ఇప్పుడు ఇచ్చి మిగిలింది తర్వాత ఇవ్వాలన్నాడు. దీనిపై ఈనెల 17న సుభానీ ఏలూరు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రూ.20 వేలను సుభానీకి ఇచ్చి పంపగా.. ఈ సొమ్మును తీసుకుండగా హనుమంతరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని రాజమండ్రి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు.

కష్టాలు ఆవరించేను

మంత్రి ఇలాకా.. సాగు సాగక..

- జల వనరులశాఖ మంత్రి జిల్లాలో సాగునీటి ఇక్కట్లు
- జూన్ 15న కాలువలకు నీరు విడుదల
- నెల రోజులు దాటినా శివారు ప్రాంతాలకు చేరని సాగునీరు
- జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2.08 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు 38 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు
- ఆచంట, పాలకొల్లు, నరసాపురంలో నత్తనడకన తొలకరి పనులు



యలమంచిలి మండలం గొల్లేపరచెరువు గట్టు ప్రాంతంలో ఎండిపోయిన నారుమడులను చూపిస్తున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) పోడూరు మండలం గుమ్ములూరు శివారున నెర్రలిచ్చిన వరి చేను

సాక్షి, భీమవరం: జల వనరులశాఖ మంత్రి సొంత జిల్లాలో రైతులను సాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. కాలువలకు నీరు విడుదల చేసి నెల రోజులైనా పూర్తి స్థాయిలో శివారు ప్రాంతాలకు చేరక తొలకరి పనులు ఆలస్యమవుతున్నాయి. జిల్లాలో 2.08 లక్షల ఎకరాల ఖరీఫ్ ఆయకట్టుకు ఇప్పటివరకు 38 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. పలుచోట్ల నీరందక నారుమడులు ఎండిపోతున్నాయి.

శివారు.. అందని నీరు

జిల్లాలో 11 ప్రధాన పంట కాలువల ద్వారా సాగు నీటి సరఫరా జరుగుతోంది. తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, భీమవరం నియోజకవర్గాలతో పోలిస్తే ఆచంట, పాలకొల్లు, నరసాపురం కాలువలకు శివారులుగా ఉన్నాయి. గతంలో జూన్ మొదటి వారంలోనే కాలువలకు నీరు విడుదల చేస్తే నవంబర్ చివరిలో వచ్చే తుపానుల బారిన పడకుండా జూలై మూడో వారం నాటికి నాట్లు పూర్తి చేసుకునేవారు. క్లోజర్ పనుల పేరిట ఈ ఏడాది జూన్ 15న నీటిని విడుదల చేశారు. అప్పటికీ క్లోజర్, ఓఅండ్ఎం పనులు పూర్తవ్వక పూర్తిస్థాయిలో కాలువలకు నీరందలేదు. జూన్ నెలాఖరు నాటికి నారుమడులు వేయడం పూర్తి కావాల్సి ఉండగా శివార్లలో జూలై రెండో వారం వరకు సాగాయి. పెనుమంత్ర, అత్తిలి, పాలకోడేరు తదితర మండలాల్లో కొన్నిచోట్ల జూన్‌లో కురిసిన వర్షాలపైనే నారుమడులు సిద్ధం చేసుకున్నారు.

ఎగువ ప్రాంతాల్లోనూ..

కాలువల ఎగువ ప్రాంతమైన తాడేపల్లిగూడెంలో ఇప్పటికే నాట్లు దాదాపు పూర్తికావాలి. ఈ నియోజకవర్గంలో 47,340 ఎకరాలకు 23,797 ఎకరాల్లో నాట్లు వేశారు. తణుకు నియోజకవర్గంలో 39,695 ఎకరాలకు 11,167 ఎకరాల్లోను, భీమవరంలో 19,740 ఎకరాలకు 200 ఎకరాలు, ఉండిలో 33,700 ఎకరాలకు 920 ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

పొలాలు.. బీడులు

వరద నీటితో గోదావరి పొంగి ప్రవహిస్తుంటే చెంతనే ఉన్న పొలాలకు చుక్కనీరు రాని పరిస్థితి ఉంది. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు బ్యాంకు కెనాల్, నరసాపురం చానల్ ద్వారా సాగునీటి సరఫరా అవుతుంది. కాకరపర్రు రెగ్యులేటర్ గేట్ల వద్ద తూడు తొలగింపు, ఓఅండ్ఎం పనులు సకాలంలో పూర్తి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్ర నీటి ఎద్దడి ఎదురైంది. సాగునీరందక పోడూరు, ఆచంట, యలమంచిలి తదితర మండలాల్లో నారుమడులు ఎండిపోయి పొలాలు బీటలు తీసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మంత్రి ఇలాకాలో నత్తనడకన..

వేలాది రూపాయలు వెచ్చించి వేసిన నారుమడులు సాగునీరందక ఎండిపోతున్నాయని పలుచోట్ల రైతులు నిరసన వ్యక్తం చేశారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లులో దాదాపు 23 వేల ఎకరాలకు ఇప్పటివరకు కేవలం 290 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేయగా పలుచోట్ల నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆచంటలో 38 వేల ఎకరాలకు 1,480 ఎకరాల్లో నాట్లు పడగా, నరసాపురంలో 7,615 ఎకరాలకు గాను ఇంకా నాట్లు పడకపోవడం గమనార్హం. శివారు ప్రాంతాల్లో చాలాచోట్ల ఇప్పటికీ సాగు పనులు మొదలవ్వక భూముల్లో గడ్డి పెరిగిపోయి ఉన్నాయి. పూర్తిస్థాయిలో కాలువలకు నీరంది, దమ్ములు చేసి, నాట్లు వేసేందుకు మరో నెలరోజులు సమయం పడుతుందని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. సాగు జాప్యంతో నవంబర్‌లో తుపాన్లతో పంటకు నష్టం కలిగించే అవకాశంతో పాటు దాళ్వా జాప్యమవుతుందంటున్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మంత్రి నియోజకవర్గంలో కొరత



తొలకరి సీజన్‌లో నీటి ఎద్దడితో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్వయంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల నియోజకవర్గంలోనూ సమస్య అధికంగా ఉంది. యలమంచిలి, ఆచంట, పోడూరు, పెను**మంత్ర తదితర ఎనిమి**ది మండలాల్లో నారుమడులు బీటలు తీశాయి. గోదావరికి వరద పోటెత్తుతుంటే సాగునీటి ఎద్దడి ప్రభుత్వ వైఫల్యమే.
– జేఎన్‌వీ గోపాలన్, సీపీఎం జిల్లా కార్యదర్శి

శివార్లలో తీవ్ర ఎద్దడి



సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. పంట కాలువ శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. నారుమడులు నెర్రలు తీసి ఎండిపోయే పరిస్థితి ఏర్పడి తీవ్రంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలి.
– కుడిపూడి శ్రీనివాస్, రైతు, చినమల్లం

రైతులు నష్టపోతున్నారు



తొలకరి ప్రారంభంలోనే తీవ్ర సాగునీటి పరిస్థితులు ఉన్నాయి. నారుమడులు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆగస్టు నెలాఖరు వరకు నాట్లు సాగితే నవంబర్, డిసెంబర్‌లో వచ్చే తుపానులతో నష్టపోవడం ఖాయం. అలాగే దాళ్వా ఆలస్యమై రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.
– మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రహదారి.. చెరువుగా మారి



చెరువులో నుంచి ఏంటి యువకులు నడిచి వెళుతున్నారు అనుకుంటున్నారా.. అయితే మీరు పొరబడినట్టే.. ఇది చింతలపూడి మండలంలోని ముక్కంపాడు గ్రామానికి వెళ్లే రహదారి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులా మారింది. దీంతో శనివారం ఉదయం నుంచి నడుములోతు నీటిలో గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ముక్కంపాడుకు రోడ్డు నిర్మాణం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, వర్షం కురిస్తే రోడ్డు పూర్తిగా జలమయమవుతోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.
– చింతలపూడి

పేదల ఇళ్లు కూల్చివేత



బాధితులను అడ్డుకుంటున్న పోలీసులు



ఆకివీడులో జేసీబీతో ఇళ్ల తొలగింపు

ఆకివీడు: పేదల ఇళ్లను కూల్చివేశారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణల తొలగింపునకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో శనివారం నగర పంచాయతీ కమిషనర్ ఆదేశాలతో పోలీసుల సమక్షంలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కాయకష్టంతో ఏళ్ల తరబడి శ్రమించి కట్టుకున్న తమ ఇళ్లు కూల్చివేయవద్దని బాధితులు మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. కూల్చివేస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బాధితులను లాగి పడేశారు. ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని 50 మంది సిబ్బంది, 10 మంది ఎస్సైల బందోబస్తులో ఆక్రమణల తొలగింపు పనులు సాగుతున్నాయి. బాధితుల్ని తొలగింపు వద్దకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. చెరువు గట్టుపై ఉన్న సుమారు 26 ఇళ్లను తొలగించాల్సి ఉండగా కొన్నింటిని తొలగించారు. చీకటి పడటంతో పనులను ఆపారు. కమిషనర్ కృష్ణమోహన్, తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్సై హనుమంతురావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ప్లాస్టిక్‌రహిత జిల్లా లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అత్తిలి: జిల్లాను ప్లాస్టిక్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా ప్రత్యేక అధికారి, మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. శనివారం తణుకు మాంటిస్సోరి హైస్కూల్, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ నాగరాణితో కలిసి ఆమె హాజరయ్యారు. మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం అవసరమని, అందరూ జ్యూట్ బ్యాగులు వాడాలని సూర్యకుమారి సూచించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన, జ్యూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై ప్రదర్శనలో విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఎంపీడీఓ లోహిత్ సాగర్, పాఠశాల హెచ్ఎం ఎస్.లక్ష్మి, ప్రిన్సిపాల్ ఏ.జ్ఞాన మంజరి, డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు పాల్గొన్నారు.

సర్ప సంరక్షణలో క్రాంతి కిరణం

● స్నేక్ సేవియర్ సొసైటీ ద్వారా సేవలు ● పాములపై ప్రజలకు అవగాహన

సండే స్పెషల్



కట్ల పాముతో క్రాంతి

జంగారెడ్డిగూడెం : పాము కనపడగానే ఎవరికైనా వెన్నులో వణుకు పడుతుంది. దానిని చంపేయాలని చూస్తాం. అయితే ఆ యువకుడు చాకచక్యంగా దానిని పట్టుకుని సురక్షిత ప్రాంతంలో వదిలి వేస్తున్నాడు. పాము నుంచి మనిషికి, మనిషి నుంచి పాముకు రక్షణ కల్పించాలనే ఆలోచనతో స్నేక్ సేవియర్‌గా మారి సేవలందిస్తున్నాడు జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన చదలవాడ క్రాంతి. 15 ఏళ్లుగా పాముల సంరక్షుడిగా ఉన్నాడు. 2016లో స్నేక్ సేవియర్ సొసైటీని స్థాపించి సర్పాల సంరక్షణతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు.

పేరంపేటకు చెందిన వ్యవసాయ కూలీలైన చదలవాడ రాజారావు, వెంకాయమ్మ కుమారుడు క్రాంతికి చిన్నతనం నుంచి ప్రకృతి, వన్యప్రాణులంటే ఇష్టం. చిన్నతనంలో పొలం పనులకు వెళ్లే సమయంలో పాము పిల్లలతో ఆడుకునేవాడు. తర్వాత కాలంలో పాములపై ఆసక్తి పెంచుకున్నాడు. పాములు పట్టడంలో కేరళలో శిక్షణ ఇస్తారని మిత్రుల ద్వారా తెలుసుకున్నాడు. 2009లో కేరళలోని కొట్టాయంలో పాములు పట్టడం, సంరక్షించడంలో వావా సురేష్ వద్ద 8 నెలల కఠోర శిక్షణ పొందాడు. తర్వాత విశాఖకు చెందిన రొక్కం కిరణ్‌కుమార్ వద్ద మరికొన్ని మెళకువలు నేర్చుకున్నాడు. 2010 నుంచి 2016 వరకు విశాఖలో ప్రజలకు సేవలు అందించాడు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లాకు తిరిగి వచ్చి 2016 డిసెంబర్ 31న స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థను స్థాపించాడు. అప్పటినుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో పాముల సంరక్షణకు కృషి చేస్తున్నాడు.

15 ఏళ్లు.. 19 వేలకు పైగా పాములు

క్రాంతి పాములు, వన్య ప్రాణుల సంరక్షణలో 15 ఏళ్లుగా తన వంతు బాధ్యత పోషిస్తున్నాడు. ఇప్పటివరకు **సుమారు 19 వేలకుపైగా పాములను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతాల్లో విడిచి పెట్టాడు. అలాగే స్నేక్ సేవియర్ సంస్థ ద్వారా పాము**ల సంరక్షణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 50కి పైగా పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాడు. పాములు, వన్యప్రాణులను రక్షించడం, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే స్నేక్ సేవియర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని క్రాంతి అంటున్నాడు. పాములకు హాని కలగకుండా చూడటమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

స్నేక్ కంట్రోల్ పౌడర్ విక్రయిస్తూ..

కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసిన క్రాంతి లాభదాయకంగా లేక కౌలు సేద్యం మానివేశాడు. ప్రస్తుతం పొలం పనులకు వెళుతూ పార్ట్ టైమ్‌గా కారు డ్రైవింగ్ చేస్తున్నాడు. పాములు పట్టుకున్నప్పుడు అభిమానంతో వారిచ్చే సొమ్ము కొంత ఇంటి నిర్వహణకు ఉపయోగపడుతుంది. అలాగే స్నేక్ కంట్రోల్ పౌడర్‌ను కిలో రూ.500కు విక్రయిస్తున్నాడు. ఇలా నెలకు 20 ప్యాకెట్ల వరకు అమ్ముతున్నాడు. ఈ పౌడర్ చల్లితే ఆ ప్రాంతంలోకి పాములు రావని చెబుతున్నాడు. క్రాంతి తండ్రి రాజారావు ఇటీవల మృతిచెందారు.

ఫిబ్రవరి 17.. జంగారెడ్డిగూడెంలోని కిడ్స్ కాన్వెంట్‌లోకి ఏడడుగుల గోధుమ తాచు ప్రవేశించింది. పాఠశాల ఆవరణలోని చెట్టు మొదళ్లలో పాము కనిపించడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే స్నేక్ సేవియల్ సొసైటీ వ్యవస్థాపకుడు చదలవాడ క్రాంతికి సమాచారం ఇచ్చారు. ఆయన హుటాహుటిన ఇక్కడకు చేరుకుని చాకచక్యంగా గోధుమ తాచును పట్టుకున్నారు. అనంతరం సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

జూలై 1.. జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోకి కోడెనాగు ప్రవేశించింది. సంతోష్ అనే కానిస్టేబుల్ కాళ్ల మధ్యలో నుంచి పాము కార్యాలయంలోనికి రావడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని స్నేక్ సేవియర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించారు. వెంటనే క్రాంతి అక్కడికి వచ్చి ఎవరికీ ఎటువంటి హాని కలగకుండా పామును సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో పోలీసు సిబ్బంది అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



గోధుమ తాచు పాముతో..

టిడ్కో గృహాలకు మోక్షమెప్పుడో?

- సంక్రాంతికే ఇస్తామన్న మంత్రి పార్థసారథి
- ఆరు నెలలు గడిచినా వాటి ఊసే లేదు


నూజివీడులో పిచ్చి మొక్కల మధ్య టిడ్కో గృహాల సముదాయం


అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

నూజివీడు: పట్టణ పరిధిలోని టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఎప్పటికి అందుతాయోనని ఎదురు చూస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని టిడ్కోకు చెల్లించి రెండేళ్లు గడిచినా ఇంతవరకు తమకు గృహాలు అప్పగించకపోగా, ఇచ్చిన రుణాలపై రెండేళ్ల మారటోరియం పూర్తికావడంతో రుణాలు ఇచ్చిన బ్యాంకర్లు ఈఎంఐలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి. 2014–19 కాలంలో పాలించిన టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల పథకాన్ని తీసుకువచ్చింది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి జతగా రాష్ట్ర ప్రభుత్వం కొంత నిధులను ఇచ్చి టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా నూజివీడు పట్టణంలో అప్పట్లో 3070 గృహాలను మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయిన ప్లాట్లు 2640 ఉన్నాయి. వీటిల్లో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లు 864, 365 చదరపు అడుగుల(సింగిల్ బెడ్‌రూమ్) విస్తీర్ణం కలిగిన ప్లాట్లు 864, 430 చదరపు అడుగుల (డబుల్ బెడ్ రూమ్) ప్లాట్లు 912 చొప్పున ఉన్నాయి.

సంక్రాంతిలోగా ఇస్తామన్నారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి గతేడాది జులైలో నూజివీడులో పర్యటించిన సమయంలో పట్టణంలోని టిడ్కో గృహాల ప్లాట్లను సంక్రాంతి కల్లా అందిస్తానని ప్రకటించారు. దీంతో లబ్ధిదారులందరూ తమ ప్లాట్లు చేతికొస్తాయని సంతోషించారు. సంక్రాంతి వచ్చింది..పోయింది తప్ప లబ్ధిదారులకు ప్లాట్లు మాత్రం చేతికి రాలేదు. సంక్రాంతి పోయి ఆరు నెలలు గడిచినా టిడ్కో గృహాల ఊసే లేదు. దీంతో ఇంకెంత కాలం ఎదురుచూడాలోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

నూజివీడులో ఉన్న 2640 ప్లాట్లలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లు 864 ఉన్నాయి. వీటికి ఒక్కొక్క దానికి లబ్ధిదారులు బ్యాంకర్ల నుంచి రూ.2.72 లక్షల రుణాన్ని తీసుకొని టిడ్కోకు చెల్లించాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్లాట్లు వచ్చిన లబ్ధిదారులకు సంబంధించిన రుణాన్ని మాఫీ చేశారు. లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి మాత్రమే కట్టించుకొని వారి పేరున ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసింది. వారికి కూడా ప్లాట్లను ఇంత వరకు అప్పగించలేదు.

పనులే ప్రారంభం కాలేదు

టిడ్కో గృహాల సముదాయ ప్రాంతంలో ఇంతవరకు రోడ్ల నిర్మాణ పనులు, డ్రైనేజీ నిర్మాణ పనులే ప్రారంభం కాలేదు. ప్లాట్‌లలో ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. విద్యుత్ వైరింగ్, రంగులు వేయడం, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు తయారు చేయడం, తలుపులు పెట్టడం తదితర పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల ముందు టిడ్కో గృహాలను అధికారంలోకి రాగానే అప్పగిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు వాటి గురించి పట్టించుకోకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తమవుతోంది.

టిడ్కో గృహాలు అందజేయాలి



పట్టణంలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఏడాది గడిచినా ప్రభుత్వం అమలు చేయలేదు. లబ్ధిదారులపై రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారు. లక్షలాది రూపాయలు రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు వడ్డీ భారం పెరిగిపోయే అవకాశాలున్నాయి.

జీ రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, నూజివీడు

క్లుప్తంగా

మంచినీటి చెరువును పరిశీలించిన అధికారులు


చెరువులో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కాళ్ల: కాళ్ల మండలం కోలనపల్లి రక్షిత మంచినీటి సరఫరా చెరువును అధికారులు శనివారం పరిశీలించారు. గ్రామంలో మంచినీటి చెరువులో చేపలు చనిపోవడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారంటూ ‘మంచినీటి చెరువులో చేపల మృతి’ అనే సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. మంచినీటి చెరువులో చనిపోయి తేలుతున్న చేపలను తీసివేసి, చెరువు గట్ల చుట్టూ పెరిగిపోయిన చెత్త మొక్కలను మనుషులతో తొలగించినట్లు అధికారులు తెలిపారు. చెరువును బ్లీచింగ్‌తో సూపర్ శానిటేషన్ చేయించామని. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ‘టాంటాం’ వేయించామన్నారు. చెరువుకు కాళ్ళ లంక చానల్ నుంచి పూర్తిస్థాయిలో పంట నీరు నింపాలని అధికారులకు ఆదేశించారు.

పారిజాతగిరిలో పూజలు


పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం వేకువజాము నుంచే సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్ఠి, బాల భోగ నివేదన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు జిల్లా నలుమూలల నుంచి కొండ పైకివచ్చి స్వామివారి ప్రత్యేక అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. ఆలయానికి విరాళం ద్వారా రూ.17,107, పూజా టిక్కెట్ల ద్వారా రూ.15,695, ప్రసాదాల ద్వారా 23,060 మొత్తం రూ.55,862 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలియజేశారు.

కుమార్తెలతో మహిళ అదృశ్యం

ఉండి: ఓ తల్లి ఇద్దరు బిడ్డలతో అదృశ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం పెదపుల్లేరు గ్రామానికి చెందిన ఓ మహిళ భర్తతో విభేదాల కారణంగా తల్లి వద్ద ఉంటుంది. ఆమెకు 12, 8 ఏళ్ల వయసున్న కుమార్తెలు వున్నారు. ఈ నెల 18న ఇద్దరు కుమార్తెలతో నిద్రపోయిన ఆమె 19న ఉదయం 5 గంటల సమయంలో తల్లి చూసేసరికి కనిపించలేదు. దీంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాలసానిపల్లి గురుకుల పాఠశాల ప్రారంభించాలి

ఏలూరు (టూటౌన్): పాలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలను వెంటనే ప్రారంభించాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భీమడోలు మండలం పాలసానిపల్లిలోని గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటుతున్న ఇంతవరకు ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దాదాపుగా 700 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు కొన్ని భవనాలు పడిపోవడంతో ఇబ్బందులు వచ్చాయని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. భవనాలు శిథిలావస్థకు వచ్చేవరకు ప్రభుత్వాలు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనతో అక్కడ ఇంటర్ చదువులు నిలిచిపోయాయని కుంటు సాకులు చెప్పడం తగదన్నారు. రోజులకు రోజులు గడిచిపోవటంతో విద్యార్థుల భవిష్యత్తుపై సర్వత్రా గందరగోళం ఏర్పడిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పాలసానిపల్లి గురుకుల పాఠశాల భవనాలు నిర్మించాలని, రిపేరుకు అవకాశం ఉన్న మేరకు మరమ్మతులు చేయాలని, అప్పటివరకు కాలయాపన చేయకుండా విద్యార్థులను దగ్గర్లో ఉన్న ఇతర పాఠశాలలకు పంపి విద్యను అందించాలని, ఆ విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మట్టి కొట్టుకుపోయిన రూ.3 కోట్లు


ఉండి ప్రజావేదికలో విచారణ చేస్తున్న అధికారులు

ఉండి: 2024–25కు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ పనుల ఖర్చుల్లో రూ.3.50 కోట్లు అధిక చెల్లింపు చేసినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. శనివారం ఉదయం నుంచి ఉండి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజావేదిక సభలో తనిఖీ బృందాల నివేదికలపై మాత్రం తప్పుదారి పట్టించేలా అధికారులు సమాధానమిచ్చారు. 2024–25 ఏడాదికి 19 గ్రామాల్లో సుమారు రూ.5.44 కోట్లకు పైగా విలువైన 1059 పనులు నిర్వహించారు. పంచాయతీరాజ్ విభాగంలో 22 పనులు రూ.67 లక్షలతో చేపట్టారు. చేపట్టిన పని ఒకటైతే నమోదు చేసిన పని మరొకటి కావడంతో సామాజిక తనిఖీ బృందాలు మండల వ్యాప్తంగా రూ.3.50 కోట్లు అధిక చెల్లింపులు చేసినట్లు నివేదికను రూపొందించాయి. కాలువలు, పంట బోదెల్లో చేపట్టిన పనులు వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. వాటిల్లో కేవలం తూడు, గుర్రపుడెక్క తొలగించారని తనిఖీ బృందాలు నివేదిక ఇస్తే.. మట్టి తీశామని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది అధికారులు వాదించారు. మట్టి పనిచేస్తే ఎందుకు ఫోటోలు ఆన్‌లైన్ చేయలేదన్నారు. అంతే అంటూ ఎన్ఆర్ఈజీఎస్ పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు సమర్థించుకున్నారు. పంట కాలువలు, బోదెల్లో వేసవిలో నీరు వుంటుందని మట్టి తీసినా కనిపించదంటూ విచిత్రంగా సమాధానాలు చెప్పారు. పనిచేసే సమయంలో ఫోటోల్లో ఎందుకు తీసిన మట్టి కనిపించలేదని పలువురు వాదించినా చెప్పిందే చెప్పి సమస్యను కప్పిపుచ్చేందుకు పీడీ పయత్నించారు.

సమావేశం అనంతరం పీడీ మాట్లాడుతూ పనుల్లో జరిగిన అవతవకలు రూ.1.61 లక్షలు రికవరీ రాశామని తెలిపారు. పలు గ్రామాల్లో వచ్చిన ఆరోపణలపై అధికారుల ఆధ్వర్యంలో రూ.5.67 లక్షల విలువైన పనులపై ఎంక్వయిరీ వేసినట్లు తెలిపారు. తనిఖీ బృందాల నివేదికల ప్రకారం.. వారు గుర్తించిన రూ.3.50 కోట్ల అధిక చెల్లింపుల్లో భాగంగా రూ.3.07 కోట్ల పనులకు సంబంధించి పని సమయంలో తీసిన ఫోటోలు అప్‌లోడ్ చేయాలని.. అలా చేయని పక్షంలో మొత్తం రూ.3.07 కోట్లు తిరిగి చెల్లించాలని మండల ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ సుజాత, విజిలెన్స్ జిల్లా అధికారి పురుషోత్తం, క్వాలిటీ కంట్రోల్ జేఈ శ్రీకాంత్, ఎంపీడీవో ఎంపీవీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నగదు రికవరీ


కేసు వివరాలను వివరిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

చింతలపూడి: చీటింగ్ కేసులో నగదు రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. చింతలపూడి డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ ఖాసింకు చింతలపూడికి చెందిన రాజ్‌కుమార్, ప్రవీణ్ అనే వ్యక్తులు వ్యాపార అవసరాల నిమిత్తం తక్కువ వడ్డీకి డబ్బులు ఇప్పిస్తామని తెలిపారు. దీంతో ఖాసిం వారి మాటలు నమ్మడంతో తొలుత ష్యూరిటీ కింద రూ.50 లక్షలు, కంపెనీ డాక్యుమెంట్స్ తీసుకు రావాలని తెలపడంతో ఈ నెల 18న ఖాసిం చింతలపూడి వచ్చారు. అలా వచ్చిన మేనేజర్‌ను రాజ్‌కుమార్, ప్రవీణ్‌లు చింతలపూడిలోని ఎరుకలపేటలోని ఒక ఇంటికి తీసుకువెళ్లారు. అక్కడ డబ్బులు లెక్కపెట్టే నెపంతో ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, వేరే మార్గంలో బయటకు వెళ్లారు. ఎంతకు రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా వారు కనిపించలేదు. తనను మోసం చేశారని గ్రహించిన మేనేజర్ చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ టి.క్రాంతి కుమార్, ఎస్సై కె.సతీష్‌కుమార్‌లు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుని వారి నుంచి రూ. 50 లక్షలు రికవరీ చేశారు. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపేటప్పుడు సదరు వ్యక్తుల గురించి పూర్తిగా సమాచారం తెలుసుకోవాలని డీఎస్పీ అన్నారు. సరైన ధ్రువీకరణ లేకుండా లావాదేవీలు చేయరాదన్నారు.

మద్దిలో అభిషేక సేవ


ఆంజనేయస్వామిని దర్శనానికి వచ్చిన భక్తులు


మద్ది క్షేత్రంలో అంజన్నకు అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. ఏలూరు జిల్లా పావులూరివారి గూడెంకు చెందిన శ్రీనివాస భజన మండలి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,10,790 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కైకలూరు: మంచి నీరు అనుకుని గడ్డి మందును తాగిన వ్యక్తి మరణించిన ఘటన కైకలూరు మండలం పెదకొట్టాడలో శుక్రవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మోరు నవీన్(35) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో గడ్డికి కొట్టేందుకు తెచ్చిన మందును తాగునీటి బాటిల్‌లో నింపి వరండాలో పెట్టాడు. శుక్రవారం పని ముగించుకుని వచ్చిన నవీన్ భార్యను మంచినీరు ఇవ్వాలని కోరాడు. ఆమె లోపలకి వెళ్లి వచ్చేలోగా వరండాలో ఉన్న వాటర్ బాటిల్‌లో మంచినీరు అనుకుని పొరపాటున తాగేశాడు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేసినప్పటికీ నవీన్ మరణించాడు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

జంగారెడ్డిగూడెం: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 29న 394.795 కేజీల గంజాయిని తరలిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ఐదుగురిని అరెస్టు చేయగా, ఇద్దరు తప్పించుకున్నారు. వారిలో కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన పిడుగు శ్రీనివాసరావు అలియాస్ బాబిని స్థానిక జాతీయ ప్రధాన రహదారిపై ఫైర్ స్టేషన్ వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బైక్, సెల్ ఫోన్ సీజ్ చేశామన్నారు. కోర్టులో హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అతనిపై మండపేట రూరల్, తిమ్మాపురం, జగ్గంపేట, రాజమండ్రి ప్రకాష్ నగర్‌లో 36 దొంగతనం కేసులు, దేవరపల్లి, పెనుమంట్ర, రాజమండ్రి, నెల్లూరు జిల్లా వి.సత్రం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నాయని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


ఆచంట వేమవరంలో గృహ నిర్బంధంలో పుష్పరాజ్

పెనుగొండ: ఉండి నియోజకవర్గంలో దళితులు నివసిస్తున్న ఇళ్లను అక్రమంగా కూల్చివేయడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విమర్శించారు. శనివారం ఆచంట వేమవరంలోని మాల మహానాడు కార్యాలయంలో పోలీసులు గృహ నిర్బంధ చేశారు. ఆకివీడు మండలం ధర్మవరం అగ్రహారంలో దళితులకు అండగా పోరాటం చేస్తామని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఉద్యమాలను అరెస్ట్‌లతో ఆపలేరన్నారు. దళితులు నివాసాలు రహదారికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చిన హామీ ప్రకారం ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే మాలమహానాడు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

● బ్రహ్మకమలం కనువిందు



ఏడాదికి ఒకసారి వికసించే బ్రహ్మకమల పుష్పాలు శుక్రవారం రాత్రి అత్తిలిలో కనువిందు చేశాయి. అత్తిలి గ్రామంలో ముత్యాల సూర్యప్రకాష్ ఇంటి పెరట్లో ఉన్న బ్రహ్మకమలం మొక్కలకు ఆరు పుష్పాలు పూశాయి. గత నాలుగేళ్లుగా ఏటా బ్రహ్మకమల పుష్పాలు వికసిస్తున్నాయని సూర్యప్రకాష్ తెలిపారు.

–అత్తిలి

నిమ్మ ధర పతనం


ఈస్ట్ యడవల్లిలో నిమ్మ తోట


ధర తగ్గటంతో కామవరపుకోట మార్కెట్ యార్డులో కనిపించని నిమ్మ రైతులు

కామవరపుకోట: నిమ్మ ధర దిగజారటంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. గత వారం రోజుల నుంచి నిమ్మకాయ రేట్లు పడిపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం కామవరపుకోట మార్కెట్ యార్డులో రైతుకు కిలో రూ.8 నుంచి రూ.10 రూపాయలకు నిమ్మకాయల రేటు దిగజారిపోయింది. మండలంలో వేల ఎకరాల్లో రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో రూ.100 పైబడి నిమ్మ ధర పలికింది. ఇప్పుడు దారుణంగా పడడంతో కూలీల ఖర్చు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో నిమ్మ ధర లభించడంతో చాలామంది రైతులు మరి ముఖ్యంగా కౌలు రైతులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు అధిక మొత్తంలో కౌలు చెల్లించి మరీ సాగు చేపట్టారు. ఈ ఏడాది మే నెల ప్రారంభం నుండే నిమ్మ ధర ఒక్కసారిగా పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితి నెలకొందని అప్పులు పాలవుతామని కౌలు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రేట్లు పడిపోవడం వల్ల కోత కోసే కూలీలకు ఖర్చులు , రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే రేట్లు నిమ్మకాయకు కొనసాగితే రైతులు అప్పులు పాలు కావాల్సిందేనని, నిమ్మ తోటలు తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కొంతమంది వ్యాపారులు దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు పంట దిగుబడి, నాణ్యతపై ప్రభావం చూపయని ఇది కూడా ధరల పతనానికి కారణమని మరి కొంతమంది చెబుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిమ్మ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యాపారుల సిండికేట్‌ను నియంత్రించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళనలో రైతులు

నిమ్మ రైతులను ఆదుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో నిమ్మ ధర రూ.100కు పైగా పలికింది. ఈ ఏడాది నిమ్మ ధర దిగజారి పోవడంతో సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టుబడులు పెరిగి ఆర్థికంగా అప్పులు పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిమ్మ పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

రాయంకుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కామవరపుకోట మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



నిమ్మ తోట దిగుబడి రావడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువగా ఉంటుంది. దీంతో అప్పు చేసి మరీ పెట్టుబడి పెట్టాను. ఈ ఏడాది నిమ్మ ధర దిగజారి పోవడంతో ఆర్థికంగా అప్పులు పాలయే పరిస్థితి ఏర్పడింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి నిమ్మ రైతులను ఆదుకోవాలి.

– మద్దుకూరి సత్యనారాయణ, ఈస్ట్ యడవల్లి, కామవరపుకోట మండలం

గ్రామాల్లో సార్వా సాగు సందడి

- ముమ్మరంగా పనులు
- బెంగాలీ కూలీలతో వరినాట్లు

అత్తిలి: తణుకు నియోజకవర్గంలో సార్వా సాగు సందడి మొదలైంది. ఏకకాలంలో ఓ వైపు నారుమడులు ఎదుగుతుండగా మరోవైపు అందివచ్చిన నారుతో నాట్లు వేస్తున్నారు. దమ్ములు, గట్టులంకలు, ఆకుతీత, దమ్ముల పనులు చేస్తున్నారు. బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు పొలాల వద్దనే మకాం ఉండి వరి నాట్లు వేస్తున్నారు. అత్తిలి మండలంలో 14,250 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. సార్వా సాగులో రైతులు ఎంటీయూ 1318, ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, పీఎల్ 1100 సంపద స్వర్ణ రకాలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే అత్తిలి మండలం వరిఘేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, ఈడూరు, కొమ్మర, ఆరవల్లి, కేఎస్ గట్టు, ఉరదాళ్ల పాలెం, పాలూరు, మంచిలి ఆయకట్టు ప్రాంతాల్లో వరినాట్ల ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. స్థానిక కూలీలతో పాటు పెద్ద సంఖ్యలో బెంగాలీ కూలీలు రావడంతో వరి నాట్లు ప్రక్రియ సజావుగా జరుగుతోంది. సాగుపనుల్లో రైతాంగం నిమగ్నమైంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు శ్రీసాగు చేపట్టారు.


బల్లిపాడు గ్రామాల్లో నాట్లు వేస్తున్న కూలీలు

విత్తన శుద్ధి, సస్యరక్షణే కీలకం

- విత్తన శుద్ధి చేస్తే పంట చీడపీడలను ఆశించకుండా ఉంటుంది.
- కిలో విత్తనానికి 2.5 గ్రాములు కార్బండిజమ్ కలిపి 24 గంటలు తరువాత నారుమడిలో వెదజల్లాలి.
- దుంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి మొలకలను దుంప నారుమడిలో చల్లుకోవాలి.
- కిలో విత్తనాలను నానబెట్టడానికి లీటరు మందు నీరు సరిపోతుంది.
- పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలుపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారుపోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటలపాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి.
- విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనాలకు మూడు గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.
- నారుమడిలో చల్లేముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరిపైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీంతో నారుమడిలో ఆకు తినే పురుగులు ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.
- నాట్లు వేసే సమయంలో నారు కొసలు తుంచడం వల్ల తల్లి పురుగులు గుడ్లను కోసలపై పెడుతుంది. నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. తద్వారా గుడ్లను నిర్మూలించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


అత్తిలి ప్రాంతంలో పంట దమ్ము చేస్తున్న దృశ్యం


ఈడూరులో ఏపుగా పెరిగిన నారుమడి

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పెంటపాడు: ఈనెల 20న పెంటపాడు ఆర్య వైశ్యసేవా సంఘం భవనంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశానికి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, పార్టీ ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

శ్రీవరాల వెంకటేశ్వరస్వామికి పూజలు

అత్తిలి: మండలంలోని ఈడూరు శ్రీ వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజ లు నిర్వహించా రు. వేకువ జాము న శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

పెంటపాడు: పాఠశాలలు విద్యా కేంద్రాలుగా విరాజిల్లాలని, తద్వారా విద్యాప్రమాణాలు తప్పక మెరుగుపరచాలని ఎంఈఓ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కె.పెంటపాడు పాఠశాలల సముదాయ సమావేశంలో ఆయన మట్లాడారు. బడిఈడు పిల్లలను తప్పక బడిలోచేర్చే కార్యక్రమంలో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ఈనెల 25 వరకు నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యాపరమైన అభివృద్ధి జరగాలని, ఉపాధ్యాయుల హాజరు నూరుశాతం ఉండాలని ఆదేశించారు. కె.పెంటపాడు జెడ్పీ స్కూలు హెచ్‌ఎం వీవీఆర్ ఎస్ కృష్ణ, సీఆర్‌ఎంటీ చార్లెస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవులకు ముద్ద వాపు నివారణ టీకాలు


కడియద్దలో ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలో ముద్ద వాపు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి టీవీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో 289 ఆవులకు టీకాలు వేశారు. గ్రామాల్లో ఇంకా ముద్ద వాపు వ్యాధి నివారణ టీకాలు వేయించని రైతులు ఉంటే గ్రామ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆయన సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

25న చలో విజయవాడ

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం రూపశంకర్, ఎస్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు పోస్టర్, కరపత్రాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వారు విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని, సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, వంట మనిషి, కమాటి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులందరికీ రూ.15 వేలు తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీలు ఏర్పాటు చేయాలని, జీఓ నెంబర్ 77, 117ను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల యాభై వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3 వేలు అమలు చేయాలని, హాస్టల్స్‌లో విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

గూడెంలో 36.4 మి.మీ. వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడచిన 24 గంటల్లో 36.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం సునీల్ కుమార్ శనివారం తెలిపారు.

రూ.4905 కోట్ల వ్యవసాయ రుణాలు

తాడేపల్లిగూడెం రూరల్: బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖ జోన్‌లోని 11 జిల్లాల్లో 81 శాఖలతో రూ.4905 కోట్ల వ్యవసాయ రుణాలు అందించిందని ఆ బ్యాంకు విశాఖపట్నం జోనల్ మేనేజర్ నిషికుమార్ సిన్హా తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని మోదుగగుంట గ్రామంలో నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీఫ్ మేనేజర్ పీపీఎస్ ఆర్ బాబు, జీఎం ఎం శుభాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలను ప్రోత్సహించండి


ఇంటి వద్ద ప్రత్యేక విద్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను ప్రోత్సహించాలని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య అన్నారు. పట్టణంలో శని వారం పాఠశాలకురాలేని, తీవ్ర వైకల్యంగల దివ్యాంగులకు ఇంటి వద్ద ప్రత్యేక విద్యను బోధించారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, సేవాలందించడంతోపాటు వివిధ నైపుణ్యాలతోపాటు తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

స్కూల్ బస్సుల తనిఖీ


తణుకులో స్కూల్ బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

అత్తిలి: ప్రైవేటు స్కూల్ బస్సులకు సంబంధించిన వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం తణుకు పట్టణంలో ఆయన ప్రైవేటు పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్నా, నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పర్మిట్ లేని ఒక ప్రైవేటు విద్యా సంస్థ స్కూల్ బస్సును జప్తు చేసుకున్నామని శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెలో భాగంగా స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద శనివారం రెండో రోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వయో పరిమిత 62 సంవత్సరాలకు పెంచి గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం ఉద్యోగస్తుల అనే పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు, ధనాల రాజు, తాడికొండ జయ రాంకృష్ణ, కొడమంచిలి ప్రసాద్, ఎస్.సతీష్, తాడికొండ భాను, కె.దయామణి, కాంట్రాక్ట్ కార్మికులు, మహిళా కార్మికులు తదితరులు నాయకత్వం వహించారు.

కూటమి పాలనపై ప్రజల అసంతృప్తి


బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కాకిలేరు గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదని, ఏగడపకు వెళ్లినా సంక్షేమ పథకాలు అందలేదని ప్రజలు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి అత్తిలి శివారు సీతానగరంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన పార్టీలు అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించారని, ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించాయని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి అమలు చేయకుండా యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడం, అధికారంలోకి వచ్చాక మోసపూరిత పాలనపై రూపొందించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం జోనల్ అధ్యక్షులు కంకటాల సతీష్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు కాసగాని చిన్నా, రామిశెట్టిరాము, బుద్దరాతి తేజ, యడ్ల ప్రసాద్, ప్రగడ బాలు, మంగిన నాని పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

అత్తిలి: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ అన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇరగవరం మండలం కాకిలేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన పోరాడుతుండడంతో కూటమి గుండెల్లో గుబులు మొదలైందని దుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల నాగమణి, ఉన్నమట్ల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ జవ్వాది ఫణిబాబు, మండల ఉపాధ్యక్షులు జవ్వాది రామోజీ, వార్డు సభ్యుడు గడ్డం రాజ్‌కుమార్, ఆసుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● ఊరించి.. ఉసూరుమనిపించి


ప్రత్తిపాడు, అలంపురం ప్రాంతాల్లో దట్టంగా కమ్మిన మబ్బులు

వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న ప్రజలను వరుణుడు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాడు. రైతులు దుక్కిలు చేపట్టి నాట్లు వేసేందుకు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని శివారు ప్రాంతాల్లో సాగు నీరు అందక రైతులు, ఎండల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం ప్రత్తిపాడు, అలంపురం ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైన దృశ్యాలివీ.

\- పెంటపాడు



'స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టండి'


ఇంటింటికి ప్రచార ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటింటికి స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టాలని పట్టణ ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజలకు షాక్ కొట్టే అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు స్థానిక భాగ్యలక్ష్మిపేట, సీతారాంపేట, నరసింహరావుపేట, నవ్వారుపేట వార్డుల్లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు విద్యుత్ సంస్కరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లును బిగించాలని ఆలోచన చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే బాదుడే, బాదుడు కార్యక్రమం చేపట్టి, స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండని చెప్పిన టీడీపీ తీరా అధికారంలోకి వచ్చిన తరువాత 9 నెలలకు రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీలు రూపంలో ప్రజలపై భారం వేసిందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే రాత్రి సమయాలలో అధిక రేట్లు వసూలు చేస్తారని వివరించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే రీచార్జి చేసుకోవాలని, అధిక రేట్లు వసూలు చేస్తారని చెప్పారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సభ్యులు జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, సాయి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: మట్టి మూటలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంచనపల్లి జాతీయ రహదారిపై శనివారం ఉదయం పెదతాడేపల్లి నుంచి అలంపురం ఆటోలో మట్టి మూటలతో డ్రైవర్ కె.నాగేశ్వరరావు బయల్దేరాడు. ఈ క్రమంలో బెంగుళూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా, ప్రథమ చికిత్స అనంతరం జాతీయ రహదారి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై పాలూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి


సబ్‌జైల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్జి సత్యవతి

అత్తిలి: తణుకు సబ్‌జైల్‌ను తణుకు నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి శనివారం సందర్శించారు. రిమాండ్ ముద్దాయిలకు అందిస్తున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు అందుతున్న న్యాయ సాయం, సేవలను అడిగితెలుసుకున్నారు. రిమాండ్ ముద్దాయిలకు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే మండల న్యాయసేవల కమిటీద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. మాదక ద్రవ్యాల, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పాతర్లంక, జైలు విజిటింగ్ న్యాయవాది కుమారి ఎస్‌కే మోథీ, న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, అంగజాల అజయ్ కుమార్, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి అడ్డుకట్ట వేద్దాం


ఉద్యాన వర్సిటీ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న వీసీ గోపాల్ తదితరులు

తాడేపల్లిగూడెం : పర్యావరణానికి హాని కలిగిస్తూ, కాలుష్య కారకంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకానికి అడ్డుకట్టవేసే బాధ్యతను అందరూ తీసుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.గోపాల్ కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వెంకట్రామన్నగూడెంలోని వర్సిటీలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ బరువు ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గరిటెలు, స్ట్రాలు, కప్పులు, ట్రేలు వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలని గోపాల్ సూచించారు. మైక్రో ప్లాస్టిక్ వాడకంతో ఆరోగ్య ప్రభావంపై నీటి వనరుల ద్వారా ఆహార సమస్యలుపై వీసీ మాట్లాడారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఎస్ సూర్యకుమారి మాట్లాడుతూ అనవసరమైన ప్లాస్టిక్ వస్తువులు ఒకసారి వాడేసి పారేసిన ప్లాస్టిక్ వస్తువులను నిరోధించాలన్నారు. అవసరం లేని ప్లాస్టిక్ వస్తువులను నివారించాలని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు సూచించారు. డీఈ గోవిందరాజులు, డీఏ పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

జగన్నాథపురంలో ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. శనివారం మండలంలోని జగన్నాథపురంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ ద్వారా కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఎంపీడీఓ ఎం విశ్వనాథ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం వెంకటేష్, ఎస్ఎంసీ చైర్మన్ అరిగెల వెంకటకృష్ణ, కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్‌సీ రవికిరణ్, ఉండ్రాజవరపు రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా

తాడేపల్లిగూడెం (టీఓసీ): షాపులు, వ్యాపా ర సంస్థల్లో ప్లాస్టిక్ వినియోగిస్తే రూ.10 వేలు జరిమానా తప్పదని తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు హెచ్చరించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మునిసిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో తాలూకా ఆఫీస్ సెంటర్ నుంచి పోలీస్ ఐలాండ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ ఐలాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రజల వద్ద ప్లాస్టిక్ ఉన్నా రూ.500 జరిమానా విధిస్తామని, ప్లాస్టిక్ రహిత తాడేపల్లిగూడెం సాధనకు కృషి చేయాలని కమిషనర్ తెలిపారు. మేనేజర్ రవి సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్ రవి, ఎంఈ వెంకట రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజు, అధికారులు, అంగన్‌వాడీలు, సెక్రటరీలు తదితరులు హాజరయ్యారు.